# పలమనేరుతో బాపూజీకి అనుబంధం

- 1930లో పలమనేరు సీడబ్ల్యూఐని సందర్శించిన మహాత్మాగాంధీ
- ఇప్పటికి తీపి గుర్తుగా ఆయన కూర్చుని సందేశం ఇచ్చిన మర్రిచెట్టు

**పలమనేరు:** పలమనేరు పట్టణంతో బాపూజీకి అనుబంధం ఉంది. స్వాతంత్య్ర పోరాటంలో భాగంగా ఆయన దక్షిణ భారతదేశ యాత్రలో భాగంగా స్థానిక వేలూర్ డయాస్‌కు చెందిన క్రిస్టియన్ ఉమెన్స్ ఇండస్ట్రియల్ స్కూల్ కాంపౌండ్‌లో 1930లో విడిది చేశారట. అప్పట్లో ఓ మర్రి చెట్టు వద్ద స్వాతంత్య్రభావాలను రగిలించేలా ఆయన స్థానికులతో సమావేశం నిర్వహించారని తెలుస్తోంది. ఇక్కడి స్కూల్ విజిటింగ్ బుక్‌లో అప్పట్లో బాపు సంతకం చేశారట. ఇవన్నీ ఇప్పటికీ చరిత్రకు సాక్ష్యాలుగా మిగిలాయి. గాంధీ ఉపన్యాసాలను విన్న స్థానికులు ఉద్యమం కోసం అప్పట్లో తమకు తోచిన విరాళాలను సైతం అందజేశారట. అనంతరం 1972లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర గవర్నర్‌గా ఉన్న కేసీ అబ్రహాం ఇక్కడికి విచ్చేయగా స్థానిక స్వాతంత్య్ర సమరయోధులు, మాజీ ఎమ్మెల్యే ఎం ఎం రత్నం గాంధీజీ సందేశం ఇచ్చిన మర్రి చెట్టును చూపడంతో గవర్నర్ సైతం ఆశ్చర్యానికి లోనై అక్కడ రచ్చబండలాగా ఏర్పాటు చేయాలని సూచించారట. ఇంతటి చారిత్రక ప్రాశస్త్యం గల ఈ స్థలాన్ని వారసత్వ సంపదగా చేయాలని కొందరు కృషిచేస్తున్నారు. ఇక ఏటా గాంధీ జయంతి, వర్ధంతిని ఈ మర్రిచెట్టు కింద నేటికి జరుపుకుంటున్నారు. పలమనేరుతో గాంధీజీకి ఉన్న అనుభంధానికి గుర్తుగా అప్పటి పలమనేరు పంచాయతీ బోర్డు స్థానిక ప్రస్తుత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని బాపూజీ ఉద్యానవనాన్ని 1956లో ఏర్పాటు చేశారట. దీన్నే ప్రస్తుతం బాపూజీ పార్కుగా పిలుస్తున్నారు.


పలమనేరులో గాంధీ సేద దీరిన మర్రిచెట్టు ఇదే

**నాటి బ్రిటీష్ పాలనకు సజీవ సాక్ష్యాలివే..**

గతంలో నార్త్ ఆర్కాట్ జిల్లాలో ఉన్న పలమనేరుకు బ్రిటీషు వారికి అనుభందం ఉండేదట. మన దేశాన్ని పరిపాలించిన బ్రిటీషు వాళ్లు నిర్మించిన, ఆ తర్వాత వారి శైలిలో క్రైస్తవ సంస్థలతో నిర్మించిన ఎన్నో పురాతన భవనాలు పలమనేరు చరిత్రకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. నాటి చరిత్రకు ఇవి ఆనవాళుగా ఉన్నాయి. అత్యంత సొగసైన ఆంగ్లేయుల శైలిలో ఏటవాలుగా ఈ భవనాలను నిర్మించారు. స్కడర్ ఫ్యామిలీ అనే వారు పలమనేరులో మిషనరీ పాఠశాలను 1904లో ప్రారంభించారు. ఇక్కడ అప్పట్లోనే మహిళలకు వివిధ రకాల శిక్షణలిచ్చి భృతిని కల్పించేవారు. దానికితోడు చిన్న పిల్లల కోసం చైల్డ్ వెల్ఫేర్ సొసైటీని నడిపేవారు. ఈ పాఠశాల వద్ద మనకు స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి జెండా పండుగను ఘనంగా నిర్వహించేవారట. ఇక్కడ బ్రిటీష్ గవర్నర్లు వచ్చి సేదదీరేవారట. అప్పట్లో వేలూరు, పుంగనూరు, పలమనేరు బ్రిటీషు వారికి వేసవి విడిది కేంద్రాలుగా ఉండేవట. ఇలాంటి ప్రదేశంలో జెండా ఎగురవేయడం స్థానికులను ఎంతగానో ఆకట్టుకొనేవట.




బాపూజీ ఉద్యానవనం, గాంధీ విగ్రహం

## పట్టుదలతోనే విజయాలు సాధ్యం


మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ చందోలు


పూజలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

**వి.కోట:** విద్య అనేది వినయాన్ని తెచ్చిపెట్టడంతో పాటు, మనసులో ఉన్న అహంకారాన్ని దూరం చేస్తుందని అలాంటి విద్యను పట్టుదలతో అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలోని విద్యానికేతన్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వేరువేరుగా హాజరయ్యారు. మొదట కళాశాల ప్రాంగణంలో విద్యాగణపతి విగ్రహ ప్రతిష్టాపన, సరస్వతి పూజా కార్యక్రమల్లో వారు పాల్గొన్నారు. ముందుగా కళాశాల కరస్పాండెంట్ దామోదరంరెడ్డి, యాజమాన్యం పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎంఈఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## కోరం లేక సమావేశం వాయిదా

**సదుం:** కోరం లేకపోవడంతో మండల సాధారణ సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్టు ఎంపీడీఓ రాజశేఖర్‌బాబు ప్రకటించారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. సమావేశం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి వివిధ శాఖల మండల అధికారులు మాత్రం హాజరయ్యారు. గంటపాటు వేచి ఉన్నా సభ్యులు ఎవరూ హాజరు కాలేదు. ఈనేపథ్యంలో వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి తిరిగి ఎప్పుడు సమావేశం నిర్వహించేది తెలియజేస్తామని ఆయన చెప్పారు. డీటీ కుమార్, ఈఓపీఆర్డీ వరప్రసాద్ పాల్గొన్నారు.

## డిగ్రీ ఫలితాల్లో శ్రీవాణి, పద్మావతి విద్యార్థుల ప్రతిభ


ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు

**పలమనేరు:** 2024 జనవరిలో జరిగిన డిగ్రీ ప్రథమ సంవత్సర తొలి సెమిస్టర్ ఫలితాల్లో పట్టణానికి చెందిన శ్రీవాణి, పద్మావతి డిగ్రీ కళాశాలల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో మంచి ఫలితాలను సాధించినట్లు ప్రిన్సిపాళ్లు శ్రీవాణి, కె.క్రిష్ణమూర్తి రెడ్డి బుధవారం తెలిపారు. ఇందులో బీఎస్సీ కంప్యూటర్స్, బీకాం కంప్యూటర్స్, బి.ఒకేషనల్స్‌లో మౌనిక, రజియా సుల్తానా, అంజలి, గిరిజ, కార్తీక్, లయ ఉత్తమ ప్రతిభను చూపారని తెలిపారు. మొత్తం మీద 72 డిస్టింక్షన్లు, 64మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల నిర్వాహకులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

## విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు

**పుంగనూరు:** పట్టణంలోని లయన్స్ క్లబ్, వీకే డెంటల్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం 200 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. పట్టణంలోని ఈస్ట్‌పేట మున్సిపల్ స్కూల్‌లో వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు విద్యాధర్, కావ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు టూత్‌పేస్ట్‌లు, బ్రష్‌లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నేత రమణ, లయన్స్ క్లబ్ ప్రతినిదులు మహేంద్రరావు, వరలక్ష్మీ, రఘుపతిరెడ్డి, కృష్ణమూర్తి, రాంకుమార్, అస్లాం, సురేష్, బాలసుబ్రమణ్యం, శ్రీకాంత్, మణికంఠ తో పాటు హెచ్‌ఎం నాగరాజు, స్కూల్ కమిటీ చైర్మన్ శోభారాణి పాల్గొన్నారు.


విద్యార్థులకు పేస్ట్, బ్రష్‌లు పంపిణీ చేస్తున్న మహేంద్రరావు, డాక్టర్లు విద్యాధర్, కావ్య

## స్వాతంత్య్ర సమరయోధులకు సన్మానం

**పలమనేరు:** ఆజీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్థానిక స్వాతంత్య్ర సమరయోధుల సన్మాన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, స్వాతంత్య్ర సమరయోధులు టీసీ రాజన్, జయలక్ష్మిని ఘనంగా సన్మానించారు. మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## రిటైర్డ్ హెచ్‌ఎంకు సన్మానం


గౌరీశంకర్ దంపతులను సన్మానిస్తున్న నేతలు

**పెద్దపంజాణి:** రాజుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసి పదవీ విరమణ చేసిన గౌరీశంకర్ దంపతులను వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. నేతలు తమ్మిరెడ్డి, డీలర్ శంకర్‌రెడ్డి, కృష్ణప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కస్తూర్బా విద్యార్థిని ప్రతిభ


మేఘన

**రామకుప్పం:** ఈనెల 10, 11 తేదీల్లో వి.కోటలో జరిగిన రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో మండలంలోని విజలాపురం కస్తూర్బా పాఠశాల విద్యార్థిని మేఘన ప్రతిభ కనబరిచింది. ఈ పోటీల్లో కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ అమరావతి తెలిపారు. కాగా మేఘన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కాంస్య పతకం సాధించిన విద్యార్థి మేఘనను పీఈటీ సంధ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

## మండల సమాఖ్య ప్రతినిధుల ఎంపిక

**పుంగనూరు:** మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం బుధవారం ఏపీఎంలు రవి, సాంబశివల ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షురాలుగా వాసంతి, ఉపాధ్యక్షురాలుగా జ్యోతి, కార్యదర్శిగా మంజుల, జాయింట్ సెక్రటరీగా మమతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా రాబోవు సంవత్సరంలో మహిళా అభివృద్ధికి మరింతగా కృషిచేయనున్నట్లు తెలిపారు. ఏపీఓ శ్రీనివాసులు, శ్రీనిధి మేనేజర్ రమ్యశ్రీ, సీసీలు శివశంకర్, నాగరత్న, భారతి, టీడీపీ నేత మాధవరెడ్డి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### డెంగీ నివారణ మందుల పంపిణీ

**పుంగనూరు:** పట్టణంలోని నాగపాళెంలో పాఠశాలలో బుధవారం డెంగీ నివారణకు హోమియో మందులు పంపిణీ చేశారు. హోమియో అసిస్టెంట్ నాగేనాయక్, మాజీ కౌన్సిలర్ దేశాది ప్రకాష్ కలసి విద్యార్థులకు హోమియో మందులు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. హెచ్‌ఎం వెంకట్రమణ, స్కూల్ కమిటీ చైర్మన్ గోపాల్ పాల్గొన్నారు.

### ఆరోగ్య సూత్రాలు పాటించాలి

**పెద్దపంజాణి:** విద్యార్థి దశ నుంచే ఆరోగ్య సూత్రాలు పాటించాలని పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి.మురళి సూచించారు. బుధవారం మండలంలోని శంకర్రాయలపేట మహాత్మా జ్యోతిభా పూలే పాఠశాలను సందర్శించి బాలికలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ జ్యోత్స్న పాల్గొన్నారు.

### దరఖాస్తు చేసుకోండి

**పుంగనూరు:** పట్టణంలోని ప్రభుత్వ మైనార్టీల ఐటీఐలో శిక్షణ ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఫిట్టర్, మెకానిక్ డీజిల్, ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ, డ్రాఫ్ట్స్‌మన్ సివిల్, మోటార్ మెకానిక్ కోర్సులకు పదో తరగతి పాస్, ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 26 సాయంత్రంలోపు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపాలన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

### నేడు రక్తదాన శిబిరం

**పుంగనూరు:** స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు మహమ్మదీయ వెల్ఫేర్ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ నాగపాళెంలోని చర్చి ఎదురుగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం:** రాజకీయాలకు అతీతంగా కుప్పం అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కోరారు. బుధవారం కుప్పం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుప్పం అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా మండలం సభ్యులు సహకరించాలని కోరారు. ఎంపీపీ అశ్విని పాల్గొన్నారు.

### కుప్పం ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓగా రాధాకృష్ణ

**రామకుప్పం:** రామకుప్పం ఈఓఆర్డీగా పనిచేస్తున్న రాధాకృష్ణను కుప్పం ఇన్‌చార్జ్ డివిజనల్ పంచాయతీ అధికారిగా (డీఎల్‌పీఓ) నియమిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆదేశాలు జారీ చేశారు. విజలాపురం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న బాబును రామకుప్పం ఇన్‌చార్జ్ ఈఓఆర్డీగా నియమించారు.

### యువకుల శ్రమదానం

**చౌడేపల్లె:** గోసులకురప్పల్లెనుంచి ఎల్లంపల్లె రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న ముళ్ల పొదలను మహేష్ ఆధ్వర్యంలో 30 మంది యువకులు శ్రమదానం చేసి తొలగించారు. యువకులు ఆరు గంటలపాటు శ్రమించి పొదలను తొలగించి రోడ్డును బాగుచేశారు. గ్రామస్తులు యువతను అభినందించారు.

## వాడవాడలా హర్ ఘర్ తిరంగా


రొంపిచెర్లలో..


సదుం: ర్యాలీ ప్రారంభిస్తున్న పెద్దిరెడ్డి

**పుంగనూరు:** వాడవాడలా హర్ ఘర్ తిరంగా ఘనంగా నిర్వహించారు. శుభారాం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో రాంనగర్ కాలనీలో ఇంటింటికీ జాతీయ జెండాలు పంపిణీ చేశారు. అలాగే కల్లూరు హైస్కూల్ హెచ్‌ఎం వెంకట్రమణారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు కలసి 550 అడుగుల జెండాను పట్టుకుని ప్రదర్శన చేశారు. డిప్యూటీ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు, కల్లూరు హైస్కూల్ కమిటీ చైర్మన్ అష్రఫ్ పాల్గొన్నారు.

**రొంపిచెర్లలో..**

**రొంపిచెర్ల:** మండల కేంద్రంలో భారీ త్రివర్ణ పతాకంతో విద్యార్థులు పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. రొంపిచెర్ల బాలుర, బాలికల, ఉర్దూ, కేజీబీవీ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు జాతీయ జెండాను వీధుల్లో ప్రదర్శించారు. ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, హెచ్‌ఎంలు లక్ష్మీదేవి, సుజాత, లోకనాథరెడ్డి, సీఆర్‌పీలు రాజేంద్ర, కిరణ్, అనసూయ పాల్గొన్నారు.

**సదుంలో..**

**సదుం:** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు భారీ జెండాతో బుధవారం ర్యాలీ చేశారు. ర్యాలీని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ప్రారంభించారు. హెచ్‌ఎం జయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

**బైరెడ్డిపల్లెలో..**

**బైరెడ్డిపల్లె:** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం బైరెడ్డిపల్లెలో ర్యాలీ నిర్వహించారు. మువ్వన్నెల జాతీయ జెండాను విద్యార్థులు చేతబూని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

**చౌడేపల్లెలో..**

**చౌడేపల్లె:** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం పురవీధుల్లో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు జగన్మోహన్‌రెడ్డి, హరి, శంకరయ్య, మురళి పాల్గొన్నారు.

**కుప్పంలో..**

**కుప్పం:** పట్టణంలో సాయిమాతా సేవాట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఎంఎఫ్‌సీ జూనియర్, వృత్తి విద్యా కళాశాల విద్యార్థులు 550 అడుగుల త్రివర్ణ పతాకం చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,సాయిమాత సేవా ట్రస్టు వ్యవస్థాపకులు జగదీష్‌బాబు, డీఎస్పీ పార్థసారథి, సీఐ జీటీ నాయుడు పాల్గొన్నారు.























